
నమస్తే తెలంగాణ
వికారాబాద్
15 | హైదరాబాద్, సోమవారం 5 ఫిబ్రవరి 2024 | VIKARABAD

# 'పది'కి సన్నద్ధం



- ఫలితాలపై విద్యాశాఖ ప్రత్యేక నజర్
- 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కార్యాచరణ..
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు
- సబ్జెక్టుల వారీగా సందేహాల నివృత్తి
- నిర్భయంగా పరీక్షలు రాసేలా ధైర్యాన్ని నింపుతున్న ఉపాధ్యాయులు
- రంగారెడ్డి జిల్లాలో టెన్త్ పరీక్షలకు హాజరు కానున్న 50,827 మంది విద్యార్థులు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 4 : పదోతరగతి వార్షిక పరీక్షలకు ప్రభుత్వం తేదీని ఖరారు చేసిన నేపథ్యంలో ఉత్తమ ఫలితాలను సాధించేందుకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కార్యాచరణను రూపొందించింది. ఉపాధ్యాయులను సన్నద్ధం చేయడమే కాకుండా విద్యార్థులకు నిష్ణాతులతో పాఠాలు బోధిస్తూ వారిలో మానసిక స్థైర్యాన్ని పెం చుతున్నది. సెలవులు మినహా పరీక్షలు ప్రారంభమయ్యే వరకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లేలా చర్యలు చేపట్టింది. జిల్లాలోని 1,148 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి 50,827 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రతి విద్యార్థీ ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు డీఈవో సుశీందర్‌రావు తెలిపారు.

### వంద శాతం ఫలితాలే లక్ష్యంగా..

టెన్త్‌లో వంద శాతం ఫలితాలను సాధించటమే లక్ష్యంగా విద్యాశాఖ ముందుకు సాగుతున్నది. ఇందుకోసం అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం వేళల్లో రోజుకు రెండుపూటలు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉద యం 9 నుంచి 10గంటల వరకు పాఠ్యాంశాల వారీగా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వారాంతంలో పరీక్ష నిర్వహించి వెనుకబడిన విద్యార్థులను గుర్తించి తీర్చిదిద్దుతున్నారు. సబ్జెక్టుల వారీగా ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేస్తూ విద్యార్థుల్లో ధైర్యాన్ని నింపుతున్నారు.

### ప్రైవేటుకు దీటుగా ఫలితాల కోసం దృష్టి..

జిల్లాలోని ఆదర్శ స్కూళ్లు, కస్తూర్బా గాంధీ, మహాత్మా జ్యోతిబాపూలే బీసీ పాఠశాలలు, సాంఘిక సంక్షేమ గురుకులాలు, మైనార్టీ సంక్షేమ.. ప్రభుత్వ పాఠశాలల్లోని పదోతరగతి విద్యార్థులు ప్రైవేట్ కు దీటుగా ఉత్తమ ఫలితాలను సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్నారు.



విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

### మెరుగైన ఫలితాలే లక్ష్యంగా ..



ప్రభుత్వ ఆదేశాల మేరకు పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాం. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో 90 శాతం సిలబస్ పూర్తైంది. మిగిలిన పాఠ్యాంశాలను ఉపాధ్యాయులు పూర్తిచేస్తూనే ఎప్పటికప్పుడు విద్యార్థులకు రివిజన్, ప్రత్యేక పరీక్షలు నిర్వహించి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. పక్కాగా అమలు అయ్యేం దుకు మండల, జిల్లాస్థాయిలో పరిశీలన బృందాలను ఏర్పాటు చేశాం. జిల్లాలో వందశాతం ఫలితాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

–సుశీందర్‌రావు, రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి

- ఇతర పార్టీలతో కలిసి సొంత పార్టీ చైర్‌పర్సన్‌పై కాంగ్రెస్ కౌన్సిలర్ల అవిశ్వాస తీర్మానం
- చైర్మన్ పదవిని ఆశిస్తున్న మర్రి నిరంజన్‌రెడ్డి
- కాంగ్రెస్ నుంచి సస్పెండ్ చేసిన అధిష్ఠానం
- అవిశ్వాస తీర్మానంపై 9న సమావేశం
- రసవత్తరంగా ఆదిబట్ల మున్సిపల్ రాజకీయం



# కాంగ్రెస్‌లో.. కుర్చీలాట

## ఆదిబట్ల మున్సిపాలిటీలో అవిశ్వాస కుంపటి

రంగారెడ్డి, ఫిబ్రవరి 4(నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆదిబట్ల మున్సి పాలిటీ కాంగ్రెస్‌లో ముసలం రాజుకున్నది. మున్సిపల్ చైర్‌పర్సన్‌పై సొంత పార్టీకి చెందిన కౌన్సి లర్లే అవిశ్వాస తీర్మానం పెట్టడం కలకలం రేపుతున్నది. అవిశ్వాసం కోసం పావులు కదుపుతున్న మర్రి నిరంజన్‌రెడ్డి ఇప్పటికే సొంత పార్టీతోపాటు ఇతర పార్టీలకు చెందిన కౌన్సిలర్లతో క్యాంపులో ఉన్నారు. ఆయన వ్యవహారంపై గుర్రుగా ఉన్న కాంగ్రెస్ అధిష్ఠానం పార్టీ ధిక్కారం కింద అతడిని పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. కోమటిరెడ్డికి నిరంజన్‌రెడ్డి ముఖ్య అనుచరుడు కావడం.. అవి శ్వాసంపై స్థానిక ఎమ్మెల్యే సైతం అసంతృప్తిగా ఉండడంతో ఈనెల 9న జరుగనున్న సమా వేశంపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది.

**మలుపులు తిరుగుతున్న రాజకీయం..**

ఆదిబట్ల కాంగ్రెస్‌లో రాజకీయం రోజుకో మలుపు తిరుగుతున్నది. మర్రి నిరంజన్‌రెడ్డి నేతృత్వంలో 13 మంది కౌన్సిలర్లు చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టారు. ప్రస్తుతం చైర్ పర్సన్‌గా కొనసాగుతున్న కొత్త ఆర్తిక కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్‌గా విజయం సాధించి బీఆర్‌ఎస్‌లో చేరి చైర్‌పర్సన్ అయ్యారు. ఈ పరిణామంతో అప్పట్లో చైర్మన్ పదవి రేసులో ఉన్న నిరంజన్‌రెడ్డికి ఆశాభంగం కలిగింది. చైర్‌పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన కొన్నాళ్లకే ఆమె తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. పాలకవర్గం పదవీ బాధ్యతలు చేపట్టి నాలుగేండ్లు ముగియడంతో తొమ్మిదో వార్డు కౌన్సిలర్ మర్రి నిరంజన్‌రెడ్డి అవిశ్వాస తీర్మానానికి పావులు కదిపారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ కౌన్సిలర్లతో కలిసి కలెక్టర్‌కు అవిశ్వాస తీర్మాన పత్రాన్ని అందజేశారు. ఈ మేరకు కలెక్టర్ శశాంక ఈనెల 9న అవిశ్వాస తీర్మానంపై సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించి కౌన్సిలర్లకు నోటీ సులు జారీ చేశారు. ఈ సందర్భంలోనే కాంగ్రెస్ అధిష్ఠానం నిరంజన్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేసి షాక్ ఇచ్చింది.

**క్యాంపులోనే కౌన్సిలర్లు..**

అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించిన కౌన్సిలర్లు అంతా కొంతకాలంగా విహార యాత్ర పేరిట క్యాం పులోనే ఉన్నారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అవిశ్వాసం వద్దనే భావనలో కాంగ్రెస్ పెద్ద లు ఉన్నట్లు తెలిసింది. అయితే అధిష్ఠానం ఆదేశాలు లెక్క చేయకుండా మర్రి నిరంజన్‌రెడ్డి అవి శ్వాసం దిశగా అడుగులు వేయడం పార్టీ పెద్దలను ఆగ్రహానికి గురి చేస్తున్నది. ఈ నేపథ్యంలోనే ఆయనకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ చిన్నారెడ్డి నోటీసును జారీ చేశారు. అయినా నిరంజన్‌రెడ్డి వెనక్కి తగ్గకపోవడంతో కాంగ్రెస్ అధిష్ఠానం రెండు రోజుల క్రితమే పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. అతడు ప్రస్తుతం పీసీసీ సభ్యుడిగా ఉన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెం కట్‌రెడ్డికి ముఖ్యఅనుచరుడు. అవిశ్వాసంపై ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సైతం ఆగ్రహంగా ఉన్న ట్లు తెలిసింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఈనెల 9న జరుగనున్న అవిశ్వాస తీర్మాన సమావేశంపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది.

## ప్రతి నెలా మొదటి ఆదివారం ఉచితంగా హెల్త్ క్యాంపులు



సిటీబ్యూరో, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా వైద్య సేవలందించడానికి 'ప్రతి నెలా మొదటి ఆదివారం' హెల్త్ క్యాంపులు నిర్వహిస్తూ స్వేచ్ఛ, కేర్ అండ్ కెరీర్ ఛారిటీ, ఎస్‌వీకే సంస్థలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే ఉచిత క్యాంపునకు అనూహ్య స్పందన వస్తున్నది. ఈ సేవలందించడానికి ప్రొఫెసర్లు, ఐటీ ఉద్యోగులు, ఆడిటర్లు వలంటీర్లుగా పని చేస్తున్నారు. ఈ హెల్త్ క్యాంపు సేవలను బస్తీ ప్రజలు, భవన నిర్మాణ కార్మికులు అత్యధికంగా ఉపయోగించుకుంటున్నారు. హెల్త్ క్యాంపులో పేషెంట్లకు నెలకు సరిపడా మందులు ఉచితంగా అందిస్తున్నారు. ఈ క్యాంపు రెండేండ్లుగా విజయవంతంగా కొనసాగుతున్నది. కంటి సమస్యలు ఉంటే పరీక్షలు చేసి కళ్లజోడు, సర్జరీ సైతం చేయిస్తున్నారు. ప్రతీ పేషెంట్‌కు అన్నం కూడా ఉచితంగా అందిస్తారు. కాగా, ఇప్పటి వరకు 9 వేల మందికి పైగా సేవలందించారు. 50 మంది వైద్యులు ఈ హెల్త్ క్యాంపులో పనిచేశారు.

## రూటు మార్చిన చైనా సైబర్ చీటర్స్

### ఎయిర్‌పోర్టులోనే ఇండియన్ పార్ట్‌నర్ ఎంపిక

సిటీబ్యూరో, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ) : ఎయిర్ పోర్టులోనే చైనా సైబర్ నేరగాళ్లు తమకు భారత్‌లో కావాల్సిన నెట్‌వర్క్‌ను ఎంపిక చేసుకుంటున్నారు. భారతదేశంలో జరుగుతున్న ఇన్వెస్ట్‌మెంట్ మోసాలకు సంబంధించిన నేరాల్లో చైనా సైబర్ నేరగాళ్ల హస్తమున్నట్లు గతంలోనే వెల్లడైంది. గతంలో ఒకరిద్దరు చైనీయులను సైతం సైబర్‌నేరాల్లో తెలంగాణ పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. దీంతో నేరగాళ్లు మరింత అప్రమత్తమయ్యారు. వివిధ వ్యాపారాల నిమిత్తం చైనా, హంకాంగ్, దుబాయ్‌కి వెళ్లే భారతీయులతో ఎయిర్ పోర్టులోనే మాట్లాడుతూ వారికి తమ బిజినెస్ వ్యూహాలను వివరిస్తూ సరికొత్త పంథాలో తమ వ్యాపార భాగస్వాములను ఎంచుకుంటున్నట్లు వెలుగులోకి వచ్చింది. చైనీయులతో చేతులు కలిపే వారు భారతదేశంలో కాల్ సెంటర్లు, బ్యాంకు ఖాతాల ఏజెంట్లను చూసి పెడుతూ ఆయా ఖాతాలలో డిపాజిట్ అయ్యే సొమ్ము విదేశాలకు చేర్పించే బాధ్యతను ఇంట్లో కూర్చొని అంతా అన్‌లైన్‌లోనే చేస్తున్నారు. అయితే చైనీయులతో చేతులు కలిపే ప్రధాన భాగస్వాములు ఎక్కువగా తమ వ్యవహారాలన్నీ దుబాయ్, హాంకాంగ్ వంటి ఇతర దేశాల నుంచి చేస్తున్నారు.

## సీబీఐ, ఈడీలతో సైబర్ పోలీసులకు శిక్షణ

- బాధితులకు న్యాయం జరగాలి
- నేరగాళ్లకు భయం పుట్టించడమే లక్ష్యంగా చర్యలు

సిటీబ్యూరో, ఫిబ్రవరి 4 (నమసే తెలంగాణ) : సైబర్ మోసాలను కట్టడి చేసేందుకు హైదరాబాద్ పోలీసులు చర్యలను వేగవంతం చేశారు. సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసగించేందుకు వాడుతున్న ఖాతాను పట్టుకునేందుకు సిబ్బందికి జాతీయ దర్యాప్తు సంస్థల నుంచి శిక్షణ ఇప్పించేందుకు సిద్ధమవుతున్నారు. ఆర్థిక పరమైన లావాదేవీలకు సంబంధించిన అంశాల దర్యాప్తులో సీబీఐ, ఈడీలకు పట్టున్నందున వారితో సైబర్ క్రైం పోలీసులకు శిక్షణ ఇప్పించాలని ప్లాన్ చేస్తున్నారు. మూలాల వరకు వెళ్లి నిందితులు ఎక్కడున్నా పట్టుకొస్తేనే బాధితులకు న్యాయం జరుగుతుందని, సైబర్‌నేరగాళ్లలో భయం ఉంటుందని, ఇందులో భాగంగానే సిబ్బందికి జాతీయ దర్యాప్తు సంస్థల అధికారులతో శిక్షణ ఇప్పించేందుకు హైదరాబాద్ జాయింట్ సీపీ(క్రైమ్స్) ఏవీ రంగనాథ్ చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తున్నది.



## ఎమ్మెల్యే కాలె యాదయ్యకు పరామర్శ



ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి



షాబాద్, ఫిబ్రవరి 4: అనారోగ్యంతో వారం రోజులుగా హైదరాబాద్‌లోని సోమాజిగూడ యశోదా దవాఖానలో చికిత్స పొందుతున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, ఉమ్మడి రంగారెడ్డిజిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి ఆదివారం వేర్వేరు సమయాల్లో దవాఖానకు వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఇరువురు వైద్యులతో మాట్లాడారు. ఎమ్మెల్యే యాదయ్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వారివెంట మొయినాబాద్ జడ్పీటీసీ కాలె శ్రీకాంత్, నాయకులు కృష్ణగౌడ్ తదితరులు ఉన్నారు.

## రేపు బీఆర్‌ఎస్ విస్తృతస్థాయి సమావేశం

**ముఖ్యఅతిథిగా హాజరుకానున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

యాచారం, ఫిబ్రవరి4: బీఆర్‌ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పాచ్చభాష ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6న ఇబ్రహీంపట్నంలో సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. మండలంలోని పార్టీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.



### గుర్తుకొస్తున్నాయి...!

ట్యాంక్‌బండ్‌పై సన్‌డే ఫన్‌డే.. జ్ఞాపకాలు..

సిటీబ్యూరో, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ): సాయంకాలం... సంధ్యా సమయం.. నగరం నడిబొడ్డున్న హుస్సేన్‌సాగర్ తీరం..అందాలతో కనువిందు చేస్తుంది. అలాంటి సాగర తీరంలోని ట్యాంక్‌బండ్‌పై గత కేసీఆర్ ప్రభుత్వం నిర్వహించిన సన్‌డే ఫన్‌డే జ్ఞాపకాలు గుర్తుకొస్తున్నాయంటూ పలువురు నెటిజన్లు ఎక్స్ వేదికగా పోస్టు చేస్తున్నారు. సకుటుంబ సపరివార సమేతంగా విచ్చేసే వారికి హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసేవారు. ముఖ్యంగా సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ట్యాంక్ బండ్ మీదుగా ట్రాఫిక్ లేకుండా పోలీసులు చర్యలు తీసుకునే వారు. దీంతో నగర వాసులంతా సన్ డే ఫన్ డే అంటూ సాయంత్రం నుంచి రాత్రి ఎంతో సరదాగా గడిపేవారని, అలాంటి రోజులు మళ్లీ రావాలని కోరుకుంటున్నామని పేర్కొన్నారు.




## బీహార్ నుంచి కాగజ్‌ఘాట్‌కు..

**ఈ 12న బల పరీక్ష.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేజారకుండా తెలంగాణకు తరలించిన అధిష్ఠానం**

**సిరి నేచర్స్ రిసార్టులో ఆశ్రయం**

**భారీ భద్రత ఏర్పాటు చేసిన పోలీస్ శాఖ**

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 4 : విశ్వాస పరీక్ష నేపథ్యంలో బీహార్‌లో రాజకీయం వేడెక్కింది. దీంతో కాంగ్రెస్ పార్టీ తమ ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు హైదరాబాద్ శివారును ఎంచుకున్నది. వారం రోజులుగా హైదరాబాద్ శివారులోని శామీర్‌పేటలో జార్ఖండ్ ఎమ్మెల్యేలకు ఆశ్రయం కల్పించగా వారు ఆదివారం తిరిగి తమ రాష్ట్రానికి వెళ్లిపోగానే.. బీహార్ ఎమ్మెల్యేలు హైదరాబాద్‌కు చేరుకున్నారు. బీహార్‌లో సీఎం నితీశ్‌కుమార్ కాంగ్రెస్ కూటమి నుంచి బయటకొచ్చి బీజేపీ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఈ నెల 12న ఆయన బలపరీక్ష ఎదుర్కొను న్న నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు జరుగుతున్న కుట్రలను గమనించిన అధిష్ఠానం 16 మంది ఎమ్మెల్యేలు చేజారిపోకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా తెలంగాణ రాష్ట్రానికి తరలించింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు అతి సమీపంలోని కాగజ్‌ఘాట్ గ్రామంలో ఉన్న సిరి నేచర్స్ రిసార్టుకు ఆదివారం సాయంత్రం భారీ బందోబస్తు మధ్య పదహారు మంది ఎమ్మెల్యేలను ప్రత్యేక బస్సులో తీసుకొచ్చారు. ఇక్కడ అత్యాధునిక సౌకర్యాలు ఉండడంతో దీనిని ఎంపికచేశారు. పరిసరాల్లోనూ భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి క్యాంపు బాధ్యతలను అధిష్ఠానం అప్పగించింది. బీహార్ ఎమ్మెల్యేలు ఈ నెల 11 వరకు ఇక్కడ ఆశ్రయం పొందనున్నారు.

## నృత్యాంజలి..

ఆదివారం మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో పద్మ పురస్కారాలకు ఎంపికైన వారిని తెలంగాణ ప్రభుత్వం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టాయి.

